సి ని మా ప్రి యు లు

సినిమాలలో నాయకీ నాయకులకు అందమైన వాళ్ళనే ఏరుకుంటారు—అంటే సినిమా చూసేవాళ్లు అందమైనవాళ్లు అనుకునేవాళ్లని. ఆ ప్రియులుకూడా వాళ్ళని మనం అందమైన వాళ్ళు అనుకోవాలనేట్టే వర్తిస్తారు. వాళ్ళ స్వంత అభిప్రాయంలో ఏమీ లోపం వుండదు. కాని ఆ అందమైనా చివరివరకు నిలువదు. ఈ లోపల, డైరెక్టర్ల ఫొటోగ్రాఫర్ల నిర్లక్ష్యంవల్లనో, రహస్య ఆగ్రహంవల్లనో, ఒక్కొక్కప్పుడు చాలా వికృతంకూడా అవుతుంది. లేకపోతే యీప్రియులే విసుగెత్తి నిజస్వరూపాలు ధరిస్తారో? చాలాసార్లు అందవికారం ఏమూలవుందో, ఆ కోణనించే వాళ్ళని మనకి పనిపట్టి ప్రదర్శిస్తున్నట్లు వుంటుంది. అయితే అందం ప్రధానంకాదు సినిమాల్లో అన్న సంగతి చదువుతారు. ఆ చదవడం, ఈ అందాలకి విరోధియై, అప్పు డప్పుడు కారణం లేకండానే అందం లోపించడంలో వ్యక్తమవుతుంది. పూర్వకాలపు కథ అనుకోండి—సత్యభామని యీనాటి స్త్రీలవలె తయారు చేయకూడదు అనే భావం జ్ఞాపకం రావడం వల్ల, జుట్టు, కనపడకండా తలనిండా పూలుచుట్టి, అక్క దక్కడ ఏనాటికీ చెందని వంకర నగలుపెట్టి, వున్న కాస్త అందాన్ని చెడగొడ

తారు. దేవతలు, రాక్షసులు, ఋషులు, మహావీరులు ఇట్లాంటివారికి ప్రత్యేక మైన అంశాలివ్వడానికి ప్రయత్నిస్తారు. ఏ అందమైనా, సినిమాలో దానికి రెండు గుణాలు వుండాలి. ఇది అందమూ అని, అందమంటే అస లేమీ ఎన్నడూ కలలోనైనా నిర్ణయంలేని మనుషులు వొప్పుకోవాలి ఆ వొప్పు కునేవాళ్ళు ఆ అందాన్ని అనుకరించడానికి అభిలషించాలి. వాళ్ళకి ఆ అనుకరణ సాధ్యమయ్యే స్థితిలో వుండాలి. ఆ అలంకారం చేసుకుంటే తాము అంతటి గ్లామర్ తెచ్చుకోగలమని అభిప్రాయం కలగాలి.

సినిమా ప్రియులు ఎప్పుడూ చాలా నీతిపరులు, శీలవంతులు, తప్పి జారికూడా ఒక్క నీచమైన కార్యం చెయ్యరు. ఒకవేళ చేసినా, మననించి సంపూర్ణమైన సానుభూతి పొందుతూనే చేస్తారు. అంటే చూసేవాళ్ళ Moral standards కి అందాలి వాళ్ళపనులు. అంతకన్న ఉన్నతమైతే వాళ్ళు అర్థంకారు ప్రేక్షకులకి. చాలా ఉదారమైన, నీతివంతాలైన వాక్యాలే మాట్లాడతారు, పాడతారు. అంటే చిన్నప్పుడు కాపీబుక్కుల్లో నేర్చుకున్న నీతివాక్యాలన్నమాట. వీళ్ళకి సాధారణంగావున్న నీతులన్నీ మామూలుగా మృగాలకి కూడా వుంటాయి. తల్లిప్రేమ, ఆడదాన్ని అనుభవించాలనే పట్టూ, విరోధులతో కలబడే శూరత్వం, ఇట్లాంటివి. కాకపోతే అడివి మనుషుల్లోకూడా వుండే సంఘభక్తీ, దైవభీతి మొదలైనవి. కాని మెదడుతో ఆలోచన చాలా తక్కువ. ఎందుకంటే వీరి సృష్టికర్తలకి నీతీ, నడవడీ, తెలివీ, వీటి విషయం చాలా తక్కువ తెలుసు గనక, తెలుసుకోడానికి వ్యవధి వుండదు. ఉన్నంతవరకైనా ప్రదర్శించే ధైర్యం వుండదు.

నాయకుడి పని శూరకార్యాలు చెయ్యడం, ప్రేమించడం. నాయకి పని అతనికోసం విరహపడడం, ఎట్లాగో ఓలాగు పాతివ్రత్యమనే పేర, తన అందాలు చల్లి, పెళ్ళి ఉచ్చులో బిగించాలని చూడడం. హీరో చాలా

బలిష్టుడు, నేర్పరి, యుద్ధప్రవీణుడు. గుర్రాలు, సైకిళ్ళు, కొండలు, కుస్తీలు చాలా సునాయాసం అతనికి. ఎన్నడూ, ఎన్ని దెబ్బలు తినినా, ఎంతరక్తం కారినా, ఇతని బలం ఏ మాత్రమూ తగ్గదు. అతనికి ఎన్నడూ జబ్బుచెయ్యదు- నాయకి సానుభూతిపొందే క్లయిమాక్సులో తప్ప అప్పుడు చచ్చిపోతాడేమోనని అనిపించేటంత, మనకి కాదు (మనకు తెలుసు బతుకు తాదని) ఆమెకి చచ్చిపోతాడేమో ననిపించేటంత జబ్బుచేస్తుంది. సాధారణ మానవులకి చేసే చిన్న చిన్న జబ్బులు అతనికి చెయ్యనే చెయ్యవు. ఒక్క హీరో కూడా ఇంతవరకు ఏ చిత్రంలోనూ చీదలేదు, ముక్కు తుడుచుకో లేదు. హీరో తంత్రిమాత్రం, దగ్గి దగ్గి చస్తాడు. అరణ్యంలోనో, మహా సముద్రం మధ్యలోనో, తిండిలేక గడిపినా సరే, అతనిముందు ఎవరూ ఆగలేరు. ఒక్క మనిషి ఏ ఆయాసమూ ప్రత్యేకమైన నేర్పూలేకండానే పది నిమిషాల్లో వెయ్యిమందిని చంపేస్తాడు. అతని కోపాన్ని చూస్తే చాలు పడిపోతూవుంటారు విరోధులు. ఈ హీరోలకి చాలా ఆపదలువొచ్చి తీర తాయి యుద్ధాలు, భూకంపాలు, శత్రువులు, అడివిమృగాలు-చాలావరకు అవి నాయకిమూలానే కలుగుతాయి. కాని, అందరికి తెలుసు యీ నాయకులు చిరంజీవులని, అశ్వద్ధామకీ, మార్కండేయుడికీ, మృత్యుంజ యుడికీ, ఐనా చావువుంది కాని, వీళ్ళకిలేదు. అపాయాల్లోంచి యీ ప్రహ్లాదులు నారాయణ మంత్రోచ్చారణ లేకండానే దాటుకొస్తారు నవ్వుతో. "చూశారా!" అని సర్కసువాళ్ళ మల్లే మన ముందే చేతులు దులుపుకుని, జబ్బలుచరిచి, నవ్వుతారు మనమొహాన. మామూలు మనుష్యదేహాలుగల మనం వాళ్ళనిచూసి చాలా యీర్ష్య పడేట్టు చేస్తారు. కొందరు ఈలలుకూడా వేస్తారు. యెంత గాయమైనా, తాటి ఎత్తునించి కిందపడ్డా, 'అబ్బా' అన్నా అనరు. ఒక్క నిమిషం అట్లా పడికూడా వుండరు. మెల్లిగా చేతులమీద ఆనుకుని అన్నా లేవరు. చువ్వల్లాగు చప్పున నుంచుంటారు. వెంటనే ఓ

దూకుదూకి పరిగెత్తుతారు. ఇరవైమైళ్ళ వేగంతో పరిగెత్తే గుర్రంమీద పాడతారు, చచ్చేట్టు కిందపడి. (ఇంక నెలరోజులు లేవలేరనుకుంటాం) కాని చిరునవ్వుతో పాడుతో లేస్తారు పైగా. నిప్పుకాల్చదు, కత్తి నరకదు, నీళ్ళు ముంచవు వీళ్ళని. ఇరవైయేళ్ళు గడుస్తాయి ఫిల్ములో. మొహంమీద ముడతపడదు, వెంట్రుక తెల్లబడదు.

ఈ నాయకులు చాలా ధనవంతులు—లేక కటిక దరిద్రులు—కాక ధనవంతులు కటిక దరిద్రులవుతారు. కటిక దరిద్రులు అమిత ధనవంతు లవుతారు. మధ్యమ జాతకం పట్టదు, ఎన్నటికీకూడా. ఫిల్ము ఆఖరయ్యే ప్పుడు సుఖభోగాలతో తులతూగుతుంటారు. కష్టాలు గలుగుతాయిగాని, అన్నీ పీడిపోయి తిరుగుతాయి.

భక్తిహీరోలు యిప్పుడు ప్రాబల్యంలోకి వస్తున్నారు. వీళ్ళు పాడడం, గెంతడంతప్ప ఇంకే సాహసకార్యాలూ చెయ్యరు. బక్క చిక్కి ఐనా వుంటారు; చాలా లావుగానన్నా వుంటారు. నిరాహారులై కూడా మనం చూస్తోవుండగా వూరతారు. వీళ్ళకి భార్య తప్ప పరస్త్రీ వుండదు. వీళ్ళ గడ్డాలూ, బోడిగుళ్ళూ, పిచ్చిపోకిళ్ళూ, భక్తి చూసి ఏ స్త్రీ వీళ్ళ దగ్గర చేరదు. ఆ వేరుగతి లేని భార్యని, భార్యకదా అని వీళ్ళు భక్తి పేర పెట్టే తిప్పలుకాక, మనకి కనపడకండా....

చోటా నాయకులు విలన్లు. వీళ్ళకి లేని దుర్గుణాలుగాని, వీళ్ళు చెయ్యలేని ఘోరాలుకాని ఆలోచించుకోడం కష్టం. మేము చాలా దుర్మా ర్గులం, అని గట్టిగా చెప్పుకుంటునట్టు తెరమీదికి వొస్తారు. కొందరు అనాగరికులు, కొందరు సూటూ, కంటికి ఒంటి అద్దం తగిలించుకు తయారవుతారు. వీళ్ళ ముఖ్యం కర్తవ్యం నాయకిని తిప్పలు పెట్టడమూ, నాయకుడూ నాయికా కలుసుకోకుండా చూసి, ఫిల్మును పొడిగించడమూ.

ఆ పనికోసం కథ మొదటినించి, కథ చివరవరకూ నాయకివంక కోర చూపులు పక్కగా చూస్తోవుంటారు. చాలాసార్లు అనిపిస్తుంది ఆ నాయకకి ఎంత బుద్ధిలేదా, ఆ సుగుణాల చలివిడి ముద్ద నాయకుడికన్న, యీవిలనే ఏ స్త్రీ కైనా ఎంత ఆకర్షణంగా వుండగలడా అని. ఈ విలన్‌కి కూడా కత్తిసామూ, గుర్రపుస్వారీ అన్నీ బాగా చేతనవును. హీరోకన్నా కూడా ప్రవీణుడు. కాని కథకుడూ, విధీ, ఇద్దరూ కుట్రచేసి ఇతన్ని ఎప్పుడూ అపజయంలోకి నెడతారు. చివరికి విసుగెత్తి ఈ విలన్ చచ్చి అన్నా పోతాడు, కాకపోతే బైరాగుల్లో నన్నా కలిసిపోతాడు. మొత్తానికి యీ విలన్ లేకపోతే, హీరోని భరించడం చాలా కష్టం.

ఈ హీరోలు గొప్ప పాటకులై తీరతారు. గొప్ప మహారాజుకూడా సమయం చిక్కినప్పుడల్లా అరుస్తాడు పాట ధోరణిలో. వీళ్ళకి ఆడవాళ్ళని చూడగానే పాట వొస్తుంది. మొదట్లో, కొత్త ప్రియురాలితో కలిసి, ప్రేమా, అగ్నీ, జ్యోతి, కోవెలా, భ్రమరమూ, పువ్వులూ, ఆకాశమూ ఈ మాటలతో డ్యూయెట్లు పాడతారు. మనకీ, ప్రియురాలికీ స్పష్టంగా కన పడేవి, వినపడేవి గుడ్డివారికీ, చెవిటివారికీ చెప్పినట్లు జాబితా ఏకరవు పెడతారు పాటలో. కోవెల అరిచి తీరుతుంది. గాలివీస్తుంది. పువ్వులు విచ్చుకుంటాయి. మంచి పట్టు సమయంలో ఒక్క తుఫాను వస్తుంది. కథా నాయిక దాంట్లో చిక్కుకు తీరుతుంది. తుపాను వస్తుందనగా ఆమె ఎప్పుడూ ఇంట్లో నిలవదు. అంతవరకు ఎన్నడూ వూరుదాటని ఆమె చప్పున అడివిలో సరాసరి బురదలోకి, ముళ్ళలోకి పోయి, దిక్కులేదనీ, రక్షించమనీ పాట పాడుతుంది.

యీ పాటలెప్పుడూ హిందీ రికార్డులకి మచ్చుగా వుంటాయి. అందరూ ఒకటేరకం పాటలు. శ్రీరాముడూ, నవీన చిత్రకారుడూ, తాని

ల్దాలూ, రిక్షావాడూ, అందరూ ఒకటే రకం ధోరణిలో-రాగంలో పాటలు ఫిల్ములో పాడారా బాగా పాడతారు, అపస్వరాలు లేకండా. ప్రేమను గురించో, జీవిత సుఖదుఃఖాలో, భక్తో, ఇవే పాటలు. కాకపోతే బావ వాస్తాడనో, చెప్పులు కొంటారా అనో ఒకటే గిరున తిరుగుతో అరుస్తారు. చూసినవాళ్ళు వీళ్ళకి మతివుందని ఎందుకు అనుకుంటారో తెలీదు.

ఈ హీరోలు ఎంత దరిద్రులైనా సరే వీరే పది రకాల వాయిద్యాలతో ఒక ఆర్కెష్ట్రా వీరి ఆధీనంలో వుంటుంది. ఆ ఆర్కెష్ట్రా వాళ్ళు ఇంక వీళ్ళని ఓ నిమిషం వొదలరు. ఎప్పుడు పాడతారో అని సృతి పెట్టుకుని సిద్ధంగా వీరి వెంటనే తిరుగుతో వుంటారు. అర్ధరాత్రులైనా సరే, నది వొడ్లమీద, సముద్రాలమధ్యా, తుపానులలో కూడా మోగిస్తారు వాయిద్యాలని. సొంతంగా కూడా ఘోషిస్తారు సంతోష సమయాల్లో, కష్ట పరిస్థితుల్లో. ఆమె పళ్లెం పడేస్తే వాళ్ళు వెనక 'ఢమ ఢమ' మంటారు. ఆమె నడుస్తోవుంటే ప్రతి అడుగుకీ, అయిష్టం తెలుపుతో, అపాయంవుందని తెలియచేస్తో 'మూ, మూ, మూ,' అని మూలుగుతారు. ఇద్దరు కొట్టుకుంటో వుంటే వీళ్ళ ఉత్సాహానికి మేరలేదు. అన్ని వాయిద్యాలలో వీళ్ళు గంతులేస్తారు. అతి రహస్యంగా ప్రియులు కలుసుకున్న సంకేత స్తలాల్లో అర్ధరాత్రి కూడా డ్యూయెట్ పాడబోతున్నారని తెలిసి వీళ్లు దూరతారు చెట్ల సందుల్లో. పక్కన యింట్లో మనుషులున్నారు. వింటే కొంప మునుగుతుందని తెలిసి కూడా Whispers మాట్లాడుతూ, డ్యూయెట్ మాత్రం మూడు మైళ్లు వినపడేట్లు అరుస్తూ పాడతారు, ప్రియులం కలుసుకున్నామనీ, తమకు ప్రేమ అనీ, పొరుగూళ్ళకి వినిపించేట్టు. వెంటనే ఆర్కెష్ట్రావారు అందుకుంటారు; కాని యీ ఆర్కెష్ట్రావారు సూర్యచంద్రులవలె తటస్థ సాక్షులు. ఎంత అపాయంలో వున్నా అపాయ

శబ్దాలు చేస్తారుగాని, సహాయం మాత్రం చెయ్యరు. స్త్రీకి బలాత్కారం జరుగుతో వుంటే ఆ చివర నిమిషాన కూడా వూత్తారుగాని, బైటపడరు. మనకి తెలిసినట్టే వాళ్ళకీ తెలుసు ఆ హద్దుదాటి ఏమీ జరగకుండా నెన్నారు ఒప్పుకునే టంతవరకు అన్నీ జరిగేటట్లుగా చూస్తో ఆమెని రక్షించడానికై సరైన నిమిషం కోసం హీరో కాచుకుని వున్నాడని.

ఈ హీరోల్లో పెళ్ళికాని వాళ్ళు తక్కువ. వాళ్ళు ఒక యువతిని చూచి ప్రేమిస్తారు. అయితే పెళ్ళి చేసుకోడానికి అన్నీ అభ్యంతరాలే. అభ్యంతరాలు అన్నీ వుండడం చూచుకొనే, వీళ్ళు నాయకులౌతారు. ఈ ఫిల్ములు చూస్తే అసలు ఇన్ని పెళ్ళిళ్ళు లోకంలో ఎట్లా జరుగుతున్నాయా అని సందేహం కలుగుతుంది. కులం, ధనం, విరోధులు తలిదండ్రులు, ఇతర స్త్రీలు, పురుషులూ, ప్రతీదీ విరోధమే. చెట్టూ, పుట్టా, దేవుడూ, వీళ్ళిద్దరూ తప్ప వీళ్ళ పెళ్ళిని అంగీకరించే చరాచరం వొక్కటీ వుండదు, ఇంత విశాల ప్రపంచంలో.

కాని, చాలామంది నాయకులకు పెళ్ళి అయివుంటుంది. పెళ్ళి అయిందా, ఆ భార్యని ప్రేమించరు. ప్రేమించడానికి వీల్లేదు, పర స్త్రీనే ప్రేమిస్తారు. కాని వీరు ప్రేమించిన స్త్రీ ఒక విలన్, దుర్మార్గురాలు, వంచకురాలు ఐ తీరుతుంది. ఇంత తెలివీ, బుద్ధిగల మనవాడు ఎందుకు అట్లాంటి స్త్రీనే ఏరుకుంటాడో ఎవరికీ తెలీదు. అట్లాంటి ద్రోహానికి, నీచ బుద్ధికి, బుద్ధిలేనితనానికి ఎవరూ ఏమీ అనరు అతన్ని. భార్య అసలేమీ అనదు. మొత్తానికి తప్పు అతనిదనిపించదు, ఆ వొయ్యారిదేగాని. ఆ స్త్రీలో ఒక్క సుగుణమైనా కనిపించదు. ఆమె తెరమీదకు రాగానే చెపుతుంది ఆమె మొహ లక్షణం తాను తేలిక మనిషిననీ. కపటురాలుననీ ఒక్క హీరోకే తెలీదు ఆ సంగతి – ప్రతి నిమిషం ఆమె వెనకే తిరిగే

హీరోకి. ఆమెకి ప్రేమ ఏ కోశాన వుండదు. అసలు ఆడదే కాదు. ప్రేమ సంగతి పాడుతుంది. చాల త్వరలో అతని డబ్బు అంతా కాజేస్తుంది. తెలివైనదే కాని, తెలివిని దుష్టత్వాని కుపయోగిస్తుంది. తప్పిజారి ఒక్కరూ నిజమున్న మనుషులు వుండరు వీళ్ళల్లో. సుగుణాలన్నీ భార్య లవి. దుర్గుణాలన్నీ ఈ స్త్రీలవి. ఇట్లా స్పష్ట విభాగం ఏర్పడి పోయింది. వీళ్ళ షోకులూ, వీళ్ళ వేషాలూ, చూపులూ, చూసినంత మాత్రాన ఎవరి కైనా తెలుస్తుంది వీళ్ళు కులటలని- అన్ని సుగుణాలూ, వివేకంవున్న హీరోకి తప్ప. అతని కళ్ళఎదుట, జరిగే మోసాన్ని కూడా చూడడు, తక్కిన వ్యవహారాల్లో చాలా జాగ్రత్త కలవాడే మళ్ళీ

ఇట్లా కొన్నాళ్ళు, ఆమె వెంట తిరిగి డబ్బంతా ఇచ్చి, వాగ్దత్తాలు చేసి, బికారి అవుతాడు. తాగుతాడు. మరీ బికారి అవుతాడు. ఆరోగ్యం పోతుంది. పోనీ, తెలివిగా భార్యనీ ఈమెనీ కూడా చూచుకునే జ్ఞానం ఏ ఒక్క హీరోకి వుండదు. తెలుసుకుంటాడు ఈ స్త్రీలోని మోసం, ఇంక మోసపోవడానికి ఏమీ లేనపుడు. ఇంకా తెలుసుకోకపోతే చివరికి ఆమె చెపుతుంది. పోతుంది. వెంటనే యిన్నాళ్ళు వొదిలేసిన భార్య దగ్గిరకొచ్చి రెండు మూడు పాటల్లో క్షమార్పణ కోరుకుంటాడు. మళ్ళీ భార్యాభర్తలు కలిసి డ్యూయెట్ పాడతారు. ఓ పిల్లవుంటే కీచుగొంతుకతో అదీ కలుస్తుంది, ఈ పాటకూనిలో.

భార్యలు సాధారణంగా కథానాయికలు కారు. వాళ్ళు తెరమీద ప్రవేశించడమే ఏడుస్తో ప్రవేశిస్తారు. సంతోషంగా వున్నారా, ఆపద త్వరగా రాక తప్పదు. వీళ్ళూ అందమైన వాళ్ళే. కాని ఆ మనుషులు

వొప్పుకున్నంతవరకు కొంత పూర్వోత్తర రకంగా వుంచుతారు యీ పాత్రల్ని. వీళ్ళల్లో ఒక్కరైనా పొరబాటునైనా పర పురుషుణ్ణి కన్నెత్తి చూడరు. అప్పుడప్పుడు పరపురుషులుమాత్రం వాళ్ళ దేహాల్నో, హృదయాల్నో అపహరించాలని చూస్తారు. కాని అట్లాంటిదుర్మార్గులకి తప్పకండా శాస్తి జరిగితీరుతుంది. ఈ పతివ్రతలు ఆ నీచుల్ని, అన్నా, నాన్నా, తమ్ముడూ అని వాళ్ళకి బుద్ధిచెప్పిస్తారు. ఆ పిలుపుతో ఎంతరౌడీ కూడా నీతిపరుడై పోతాడు. వీళ్ళల్లో కొందరు, అట్లా పిలవడం మరిచి పోయి, గొప్ప వీరకృత్యాలుచేసి తప్పించుకుంటారు. భర్తలు వీళ్ళని వొదలడమే కాదు, బాగా హింసిస్తారు. వీళ్ళు భర్తల కాళ్ళావేళ్ళాపడి వినికించి, హింసింపించుకుంటారు? భర్త ఏంచేసినాసరే వీళ్ళకి కోపమన్నమాటరాదు. అతను హింసించినకొద్దీ నాథా, ప్రాణనాథా, పంచప్రాణనాథా, జీవితేశ్వరా, అని ప్రాధేయపడతారు. ఈరకం స్త్రీలని భర్త తంతోవుంటే ప్రేక్షకుల సానుభూతి భర్త పక్షమే ఉంటుంది.

భర్త ఎప్పుడు కష్టపెడతాడా, ఎప్పుడు తన సహనాన్ని ప్రదర్శిద్దామా, ఎప్పుడు ఏడుపుపాట పాడడానికి సమయం చిక్కుతుందా అని కాచుకుని వున్నట్టుంటాయి వీళ్ళమొహాలు. ఈమె పిల్లలు కూడా ఎన్నడూ అల్లరి చెయ్యక తల్లితోబాటు తండ్రి హింసలకి ఎదురు చూస్తో, తల్లితో కలిసి ఏడుస్తో వుంటారు. తండ్రిని ఎన్నడూ తిట్టరు. ఈ భార్యలకి దైవభక్తి అమితం. పూజలు, నోములు, వ్రతాలతోటి నిండిపోతుంది బతుకు. విధినీ, దేవుణ్ణి పాటల్లో తిడతారు. కొంచెం కులాసాకి పుట్టింటికైనా పోరు. వీళ్ళరోదతో, ఈర్ష్యలతో, రోదనలతో భర్త బతుకు ఘోరం చెయ్యాలనే కసితో, కాచుకు కూచుంటారు, ఆ మొగాడు ఎప్పుడు ఇల్లు చేరుకుంటాడా, పనిపట్టిద్దామా అని పీనిగల్లాగు వేళ్ళాడుతో. ఏ కోశానా అభిమానం, రోషం, బుద్ధి కనపడవు వీళ్ళల్లో. అతను గుమ్మంలో

కాలుపెట్టడంతోటే, మళ్ళీ వెళ్ళిందాకా పిశాచాల్లాగు పట్టుకు వేళ్ళాడి నీచంగా ఏడుస్తారు.

ఆ కొత్త స్త్రీని విడిచాక భర్త ఇంకో స్త్రీదగ్గిరికిపోడు. జన్మకి అతనికి బుద్ధి వస్తుంది. పోనీ ఈ సారి తెలివిగా ఇంకో స్త్రీని పట్టాలని చూడడు. సరాసరి ఈ భార్య పాదాల మీద వాలతాడు. అక్కడితో కథ ఆఖరవు తుంది. కాని ఈ ఇద్దరూ ఇంట్లో మళ్ళీ ఎట్లా కాపరం చెయ్యగలిగారు. వీళ్ళకి మామూలు మనుషులకి వుండే రక్తమాంసాలున్నాయా అని ఆశ్చర్యం. భర్తచేత ఇన్ని తన్నులు తిని, ఏడ్చి, అవమానాన్నిపొంది. ఆ మహాయిల్లాలు, ఏమీ సంకోచమూ, సిగ్గూ లేకుండా, అతన్ని కావిలించు కుని, ఎగిరి ఎగిరి డ్యూయెట్ పాడుతుంది, ఎంతలావుపాటిదీ, వయస్సు మళ్ళిందీ ఐనాసరే.

ఆ భర్త ప్రవర్తన చూసిన ఏ బుద్ధిహీనురాలికైనా తోస్తుంది-అతను చేసిన ఘోరకృత్యాల తరవాత ఎన్నటికీ ఆ మనిషిని నమ్మడానికి వీలు లేదని-ఒక్క యీ పతివ్రతకి తప్ప. ఈ భార్యని భర్త వొదలిన రోజుల్లో ఆమెని ఆదరించే బంధువుగాని, స్నేహితులుగాని వుండరు. మనం చూస్తో వుండగా తండ్రి అరగంటసేపు తన్నుకుని ఎగశ్వాస పిలుస్తో చస్తాడు. అన్నదమ్ములు అసలు కనపడరు. పిల్లలు చిన్న వాళ్లు. మొత్తానికి ఏ దిక్కూ కనబడదు.

ఈ ఫిల్ముల్లో, మంచి ఎన్నడూ విజయం పొందుతుంది. మంచి

అందే కథానాయకుడూ నాయికా అన్నమాట చెడ్డ నశిస్తుంది లేక పశ్చాత్తాప పడుతుంది, లేక చస్తుంది. కాకపోతే సన్యాసం తీసుకుని తత్వాలు పాడుతుంది. కాని లోకంలో జరిగేట్టు మంచివాళ్ళు, బీదరికంలో, కష్టంలో నిలిచిపోరు. ఈ దుర్మార్గురాళ్ళయిన స్త్రీలు అట్లాగే ఇంకో మొగాడికోసం పన్నాగం వేస్తో వుండిపోరు. అన్నీ చక్కగా తీర్చినట్టు సర్దుకుపోతాయి. పోతాయని ముందే తెలుసు మనకి.

ఎందుకు ప్రియురాలు ఎప్పుడూ దుర్మార్గురాలో, ఎందుకు ఆమెని యీ హీరో అంత వెంటబడి ప్రేమిస్తాడో, అట్లా ప్రేమించడానికి అత నెంత నీచుడో, అట్లాంటివాణ్ణి ఎందుకు ఆ భార్య తిరిగి స్వీకరిస్తుందో, స్వీకరించడంవల్ల ఎంత నీచురాలవుతుందో ఇవి ఎవరూ ఆలోచించరు.

ఈ కథానాయికల్లో కొంత మంది వితంతువులు వుంటారు. నాయకుడికి వీళ్ళమీద ప్రేమరావడానికి కారణం వాళ్ళు వితంతువులు కావడం తప్ప యింకేం కారణం కనిపించదు. అకస్మాత్తుగా వితంతువుల బాధల మీద అమితమైన జాలికలిగి పాటపాడతాడు. ఆమెతో నిన్ను పెళ్ళిచేసుకోవాలని వుందనీ అనడు. పసుపు కుంకుమ నీ జన్మహక్కు కాదా అని పాడతాడు. ఆ జన్మ హక్కుని ఇంకోడితో తీర్చుకుంటానంటే వొప్పుకోడు. ఆ హక్కు అతని జేబులో పెట్టుకుని తిరుగుతున్నట్టు ఫీలవుతుంది, ఆ వితంతువుకూడా, ఆ హక్కు యింకో మగవాడిదగ్గర వుండనట్టే. వెంటనే ఓ కుంకం భరిణ సంపాదించి ఆమె వెంటపడతాడు. ఆ కుంకం భరిణని చూసి, తనకు గర్భం కలుగుతున్నంత భయంతో పరిగెత్తుతుం దీమె. ఏం

చేసినా వొప్పుకుంటుందిగాని, ఆమె ఆ కుంకం మెహాన పెట్టించుకోడానికి వొప్పుకోదు.

ప్రస్తుతం పరాయి ప్రియురాళ్ళు దేవతాస్త్రీ లవుతున్నారు. వీళ్ళని దేవత లని చూపించడానికి ఫిల్ముబాళ్ళు పడే శ్రమచూస్తే చాలా జాలి వేస్తుంది. యే వికృతమోచేసి వాళ్ళని దేవతా స్త్రీలంటే పనికిరాదుమరి. వాళ్ళకి ఆకర్షణ ఉండాలి. పురాణంలో ఏవీ ఆధారాలు దొరకలేదు. కనక స్వంత కల్పనతో పాశ్చాత్య దేవతలు చేద్దామనుకున్నారు. రెక్కలు పెట్టీ, గౌన్లు తొడిగీ, మొహాన బాగా సుద్దపట్టించీ, నెత్తిమీద ఆకుల చక్రాలు పెట్టీ, గట్టిజంపర్లు తొడిగీ, చాలా జాలివేస్తుంది-వీళ్ళు దినదినమూ, ఆ తయారుకి ఎట్లావొప్పుకున్నారా అని. వీళ్ళని సరిగా నుంచోనీరు, కూర్చోనీరు. సన్నకొండ శిఖరాలూ, మబ్బులూ, గాలీ, చెరువులూ, ఆకాశం, వీటిల్లో నుంచోపెడతారు, తేలిస్తారు. వీళ్ళని చూస్తే మద్రాసులో నల్లటి యూరేషియన్ ముసలమ్మలు ఎవరో యిచ్చిన పాతగౌన్లు వేసుకొని, చిరిగిన షూలతో ఇంగ్లీషులో అడుక్కుంటారూ-వాళ్ళు జ్ఞాపకం వొస్తారు.

మచ్చుకి వీళ్ళ వెకిలివేషాలూ, చొంగలూ, పాటలూ చూస్తే ఏడుపు వొస్తుంది, 'మానవుడా! నీ స్వర్గం ఇదా!' అని.

ఫిల్ములో ప్రేమ చాలా అకస్మాత్తుగా వస్తుంది- విపరీతంగా భూకంపం వలె. ప్రేమ కలగాలనే నాయిక ఏదో భయోత్పాతమైన కార్యం చేస్తుంది. వొకటి, గిర్రున తిరిగి పాట పాడుతుంది. రెండు వుయ్యాల

వూగుతుంది. మూడు అభినయం పడుతుంది. ఆమెవెంట ఆరెస్ట్రా ఒకచే 'కుయ్ కుయ్' మంటుంది-చిత్రకార్తి కుక్కని సూచిస్తో. కెమేరాకి పిచ్చెక్కి ఆమెవెంట గిరగిరా పల్టీలు కొడుతుంది. చెట్లూ, భూమి, స్తంభాలు, గిర్రున తిరిగిపోతాయి మనకళ్ళముందు. ఈ గెంతే నాయికకి ముప్పైఏళ్ళకి తక్కువ వుండవని మనకి కెమెరా చెపుతూనే వుంటుంది. కాని ఆమె తనకి పదహారేళ్ళని నమ్మమని గోలచేస్తుంది. మారాంపట్టి 'నమ్మరా కావలిస్తే, చూడండి' అని పావడఎత్తి గిర్రున తిరుగుతుంది. పొదల్లో దూరుతుంది. మేడమెట్లు నాలుగేసి ఒక్కసారి దూకుతుంది.

ఇంత చేసినా ఆమెకి తనకి కలిగింది ప్రేమ అని ఆమెకే నమ్మకం వుండదు గావును! మనం నమ్మలేదని అనుమానమో ఏమో! ప్రేమవొచ్చిన వాళ్ళు ఏం చేస్తారో సినిమా మనుషులకి తెలీక అయి వుండ వచ్చు. ఈ నాయికా నాయకులు 'మాకు ప్రేమవొచ్చిందో' అని అరుస్తారు, పెద్దరోగం పుట్టినట్టు. 'అవును నమ్మండి. మాకుకూడా తెలుసు' అని బాకావాళ్ళు అరుస్తారు వెనకనించి పువ్వులు. పక్షులు, వాయువు, ఆకాశం, అన్నీ "అమ్మో, అమ్మో, ఎంతప్రేమవొచ్చింది వీళ్ళకి. ఏం చెయ్యం! ఏ చెయ్యం" అంటాయి. ప్రేమవచ్చిన మనుషులమధ్యవుండే నిశ్శబ్దంగాని, మామూలు సంభాషణగాని వీళ్ళకిరావు. కోవెలలూ, కాంతులూ, జ్యోతులూ, స్వర్గాలూ, పుణ్యాలూ, వీటిసంగతే సంభాషణ. ఈ ప్రియులు ఎక్కడ కలుసుకోనీ, చీకటి గుడిసెలోనైనా సరే, అర్ధ

రాత్రి అరణ్యంలో నైనాసరే మీద పెద్ద వెలుగు పడుతోనే వుంటుంది. వెనక బాజాలగోల వినపడుతోనే వుంటుంది.

ఏ ప్రియులైనా ప్రేమ డ్యూయెట్ పాడితీరతారు.

ఇది ప్రేమలాగుందంటాడు ఆకాశం కేసి చూస్తో.

అవును, అలాగే వుందంటారు ఇద్దరు బాకా వాళ్ళు.

అట్లాగే కనపడుతోందంటుంది, చెట్టు కొమ్మమీద చెయ్యేసి.

రెండుపువ్వులు వూగుతాయి.

కనపడుతోందని సన్నపీకవాడు వుయ్‌మంటాడు.

అయితే, ఇది ప్రేమే అంటాడు హీరో, ఆ పక్కకి వొరిగి.

నలుగురు బొయ్‌బొయ్ మంటారు వెనక.

ఆ కూసే కోవెలని చూడు అంటుంది ఆమె, ఒక్క గంతేసి.

రెండు పావురాలు ముక్కులతో పొడుకుంటాయి.

కోవెలలాగు కూస్తారు ఇద్దరు తూతూలవారు.

★